క్లుప్తంగా

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో బండి సంజయ్

కొండగట్టు: కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. కొడిమ్యాల మాజీ సర్పంచ్ ఏలేటి మమత నరసింహారెడ్డి, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం బీజేపీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

నర్సరీల్లో మొక్కలను కాపాడాలి



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

వెల్గటూర్ : నర్సరీల్లో మొక్కలను కాపాడాలని జగిత్యాల జెడ్పీ సీఈవో రఘువరన్ అన్నారు. మండల కేంద్రంతో పాటు, స్తంభంపల్లి, పాశిగామ గ్రామాల్లోని నర్సరీలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌కు అవసరమైన మొక్కలను అందించే విధంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాల్లో నిలవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న నరేశ్

జగిత్యాల: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలబడాలని ఎస్ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నరేశ్ అన్నారు. శనివారం నలంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కడున్నా చదువు నేర్పిన గురువులను మరిచిపోవద్దని, ఉన్నత స్థానాల్లో నిలబడిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాల నుంచి ఐపీఎల్ రాజస్తాన్ రాయల్స్‌కు వంశీ అనే విద్యార్థి నెట్ బౌలర్‌గా ఎంపికవడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

జీవన్‌రెడ్డి గెలుపొందాలని పూజలు



జ్యోతి దంపతులను సన్మానిస్తున్న భీవండి పద్మశాలీ సంఘం ప్రతినిధులు

జగిత్యాలటౌన్: నిజామాబాద్ ఎంపీగా పోటీచేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భారీ మెజారిటీ గెలుపొందాలని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి దంపతులు శనివారం మహారాష్ట్రలోని షిర్డీతో పాటు శనిసింగాపూర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భీవండి చేరుకున్న చైర్మన్ జ్యోతి దంపతులను భీవండి పద్మశాలీ సమాజం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడం కోసం శ్రీసత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. యువజన సంఘాలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, నాయకులు శ్రీనివాస్, ఆర్ఎంపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వార్షికోత్సవ సంబరాలు

జగిత్యాలరూరల్: మండలంలోని గుల్లపేటలో శనివారం ప్రీస్కూల్ ఈసీసీఈ డే వార్షికోత్సవం వేడుకలను తల్లిదండ్రుల సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జమునరాణి, ప్రేమలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని దుంపేట, సిరికొండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పూర్వ ప్రాథమిక విద్యాదినోత్సవం నిర్వహించారు. చిన్నారులు వివిధ అంశాల్లో చూపిన ప్రతిభను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాయికల్: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే చిన్నారులు ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. పట్టణంలోని 2,3,5 అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఇటిక్యాల, దావన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు.

జగిత్యాల: చిన్నారులకు పోషకాహారం అందిస్తేనే ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని కూసరివాడలో ఐసీడీఎస్ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు నీలవేని రజిని, యతీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి ప్రాజెక్టులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ప్రీస్కూల్ విద్యార్థులకు ఆట పాటలతో వివిధ రకాలపై డ్యాన్సు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు,వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి:మండలంలోని ఉప్పుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ వేడుకలో చిన్నారులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సూపర్‌వైజర్ మహేశ్వరి, టీచర్ సుహాసిని పాల్గొన్నారు.

వెల్గటూర్ : వెల్గటూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో పిల్లలకు శనివారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఏడు నెలల నుండి మూడేళ్లలోపు పిల్లలకు టీహెచ్ఆర్, గుడ్లు బాలామృతం పంపిణీ చేశారు.



కూసరివాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది





జగిత్యాల మండలం గుల్లపేట కేంద్రంలో, పెగడపల్లి మండలం ఉప్పపల్లిలో వార్షికోత్సవ వేడుకలు



ధర్మపురి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ఘనంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణం

కోరుట్ల: పట్టణంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ 34వ వార్షికోత్సవం, సంతోషిమాత ఆలయ 24 వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూసల సంఘం, ఎస్ఎల్ఎన్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం

గొల్లపల్లి : మండలంలోని చిల్వ కోడూర్ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ స్వామివారి కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ దాసరి తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు నిశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణంలో భాగంగా తాళి బొట్టు చూపుతున్న అర్చకులు

జై హనుమాన్ దీక్షా సేవా సమితి పూజలు

కోరుట్ల: పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జై హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, జై హనుమాన్ దీక్షా సేవా సమితి సభ్యులు, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

తాగునీటిలో బ్లీచింగ్ ఫౌడర్ తప్పనిసరి

ఇబ్రహీంపట్నం: తాగునీటిలో బ్లీచింగ్ పౌడర్‌ను తప్పనిసరిగా కలపాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ అన్నారు. శనివారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో రక్షిత మంచినీటి బావిని, కంచెరి కుంటను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. బావిలో బ్లీచింగ్ పౌడర్‌ను కలిపించారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందునా బావిలో సరిపడా నీళ్లు ఉంటాయా, భూగర్భ జలాలు తగ్గుతాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బావిలో బ్లీచింగ్‌ను కల్పిస్తున్న జెడ్పీ సీఈవో

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ



నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మపురి/వెల్గటూర్: వివిధ కారణాలతో పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను శనివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. పట్టణంలోని కాశెట్టివాడకు చెందిన పాదం పెద్దన్న, ఆకుల చిన్న గంగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణానికి చెందిన దూడ వెంకట్ మృతి చెందగా, మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. ఎండపల్లి మండలం గుల్లకోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగంపల్లి చంద్రయ్య, మారేడ్‌పల్లికి చెందిన ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మల్లేశం,లింగారెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాయికల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. శనివారం ధర్మాజీపేట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం శ్రావణి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలంతా పార్టీ పటిష్టతకు కృషిచేస్తూ నరేంద్రమోదీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, మండల నాయకులు తిరుపతినాయక్, గంగరాజం, పర్శురాం, సుమన్, రమేశ్, పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కథలాపూర్: మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి పదోతరగతి వరకు ప్రవేశాలకు ఆదివారం నిర్వహించే పరీక్షలకు కథలాపూర్ మోడల్‌స్కూల్‌లో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ నరేశ్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఆరోతరగతి ప్రవేశ పరీక్షకు 193 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించే 7, 8, 9, 10వ తరగతి ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు 124 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

సెల్‌టవర్ బ్యాటరీలు మాయం

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు సంబంధించిన బ్యాటరీలు మాయం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. విద్యుత్ సరఫరాలేని సమయంలో సెల్‌టవర్ పనిచేసేందుకు సెల్‌టవర్ వద్ద రెండు సెట్ల బ్యాటరీలను అమర్చామన్నారు. ఈ రెండు సెట్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు కంపెనీ కాంట్రాక్టర్ గుగ్గిల్ల హరీశ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగిత్యాలకు చేరుకున్న ఓటరు చైతన్య సైకిల్ యాత్ర

జగిత్యాలటౌన్: సిద్దిపేటకు చెందిన పిడిశెట్టి రాజు చేపట్టిన ఓటరు చైతన్య సైకిల్ యాత్ర జగిత్యాలకు చేరుకుంది. లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వెంకటేశ్వరపల్లికి చెందిన సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు ఓటర్లలో చైతన్యం కలిగించి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా అవగాహన కల్పించేందుకు చేస్తున్న సైకిల్ యాత్ర చేపట్టగా శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రానికి చేరుకున్నాడు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరాడు. ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు మండుటెండను సైతం లెక్క చేయకుండా సైకిల్ యాత్ర చేస్తున్న రాజును జగిత్యాల బీసీ సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన నాగుల సతీశ్‌పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ శనివారం తెలిపారు. మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన పుట్ట గంగాధర్ వరిపొలంలో నాగుల సతీశ్‌కు చెందిన గొర్రెలు మేయగా ఈనెల 3న పెద్దమనుషుల సమక్షంలో పిలిపించి మాట్లాడుతుండగా సతీశ్ గంగాధర్‌ను కులం పేరుతో దూషించి చెప్పుతో కొట్టి అవమానించాడని, గంగాధర్ ఫిర్యాదు మేరకు సతీశ్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కథలాపూర్: మండల కేంద్రంలోని శివారులో శనివారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు కథలాపూర్ శివారులో పేకాట స్థావరంపై పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేయగా.. ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారన్నారు. వారి వద్దనుంచి రూ. 7,200 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

జగిత్యాల: పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని వెటర్నరీ ఆఫీసర్ పూర్ణచందర్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో 324 గేదెలు, 36 ఆవులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కోరుట్ల: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ నాయకురాలు సోగ్రాబీ, ఏఆర్ అక్బర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డా. అనూప్‌రావు–స్వీటీ అనూప్ దంపతులు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, తదితరులు పాల్గొన్నారు.

టింబర్‌డిపో సామిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రానికి చెందిన టింబర్ డిపో, సామిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు ఎఫ్ఆర్వో ప్రణీత్‌కౌర్, డీఆర్వో అరుణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ మహ్మద్ ఫిరోజ్ అలీ, టింబర్ డిపో సామిల్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



రాయికల్, కోరుట్లలో జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

బుగ్గారం: దేశంలో అవినీతిరహిత పాలన ఒక్క బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుగ్గారం మండలం వెల్గొండ లో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సత్యం,రాజేశ్,బండారి లక్ష్మణ్,శ్రీధర్,పల్లికొండ అనిల్,హరీశ్,సునీల్,పోషరాజం తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో వేంకటేశ్వర ఆలయంలో బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాడవేణి నరేష్, పెండెం గణేశ్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

మెట్‌పల్లి: పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు రమేశ్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు.

ఇబ్రహీంపట్నం:మండలకేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని భూపతిపూర్‌లో బీజేపీ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.

మేడిపల్లి: మేడిపల్లి మండల కేంద్రం, పలు గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



వెల్గొండలో జెండావిష్కరించిన జిల్లా అధ్యక్షుడు

పెగడపల్లి:మండల కేంద్రంతో పాటు మండలంలోని నందగిరిలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా జరిపారు.

ధర్మపురి : బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నంది కూడలి వద్ద పట్టణ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్, జైనా గ్రామంలో మండల శాఖ అధ్యక్షుడు గంగారాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు.

మల్లాపూర్ : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటకు మిట్టపెల్లి సుమ ఎంబీబీఎస్ పూర్తి చేయడంతో శనివారం గ్రామంలో పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు సన్మానించారు. సుమ ప్రతిభ కనభర్చి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించి కోర్సును పూర్తిచేసిందని కొనియాడారు. తల్లిదండ్రులతో పాటు గ్రామానికి పేరు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యంలో తాలు, తప్ప లేకుండా చూసుకోవాలి

సారంగాపూర్: ధాన్యంలో తాలు, తప్ప లేకుండా హార్వేస్టర్ల ఆర్‌పీఎంను 18–19 వరకు పెంచాలని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి అనూష అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ధాన్యంలో తాలు, తప్ప లేకుండా ఉండేందుకు హార్వెస్టర్‌లో తాలు, తప్ప పోవడానికి ఏర్పాటైన ఫ్యాన్‌లో స్పీడు (ఆర్‌పీఎం) 18–19 ఉండాలని సూచించారు. సమావేశంలో ఏఈవో సందీప్ తదితరులు ఉన్నారు.

పీఈటీకి ఎన్‌సీసీ అధికారి ర్యాంక్

కోరుట్ల: పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ ఉపాధ్యాయుడు గుగులోత్ విజయ్ ఎన్‌సీసీ అధికారిగా ర్యాంక్ సాధించాడు. 2023 నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ నిర్వహణకు శిక్షణ ఆఫీసర్‌గా ఉన్నారు. అధికారి ర్యాంక్ కోసం జనవరి 28 నుంచి మార్చి 28 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వద్దగల సైనిక శిబిరం ఎన్‌సీసీ బెటాలియన్ లో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ కిజర్, ప్రిన్సిపాల్ గోపి మరాసి, ఉపాధ్యాయులు అభినందించారు.

అయోడిన్ ఉప్పును పరీక్షించిన వైద్యులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, యామాపూర్ ప్రాథమిక పాఠశాలలో అయోడిన్ ఉప్పును వైద్యాధికారి హరీశ్ పరీక్షించారు. గోధూర్‌లో 90 మంది విద్యార్థులు, వేములకుర్తిలో 90 మంది విద్యార్థులు తమ ఇళ్లలో వాడే వివిధ కంపెనీలకు చెందిన ఉప్పు శాంపిల్లను తెప్పించుకొని అందులో అయోడిన్ ఉందా లేదా పరీక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హరీశ్ మాట్లాడుతూ కొన్ని రకాల కంపెనీల ఉప్పులో అయోడిన్ లేకపోవడంతో అయోడిన్ లోపం వస్తుందని అందుకే పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయభాస్కర్, పీహెచ్ఎన్ హేమలత, హెచ్ఇవో కృపాకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కో–ఆప్షన్ సభ్యురాలు

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యురాలు రెంజర్ల కళ్యాణి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కళ్యాణికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ తిరుమల గంగాదర్ గౌడ్, కౌన్సిలర్ నాగభూషణం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజం, నాయకులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, నాయకులు ఎల్ల నరేశ్ శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ చేపట్టిన రైతు దీక్ష శిబిరం వద్ద పారిశుద్ధ్య సిబ్బంది చేత పని చేయించారని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదానం చేసిన ఉపాధ్యాయుడు

జగిత్యాల: పట్టణంలోని కృష్ణనగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన కిశోర్ అనే ఉపాధ్యాయుడికి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో శ్రీచైతన్య కరీంనగర్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ఆచార్య రక్తదానం చేసి ఆయన ప్రాణాలు కాపాడారు. సామాజిక సేవలో భాగంగా 60 సార్లు రక్తదానం చేయడం జరిగిందని తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాస్

మెట్‌పల్లి: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన వడ్డెపల్లి శ్రీనివాస్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు శనివారం తెలిపారు. కాగా తన నియమాకానికి సహకరించిన ఎంపీ అర్వింద్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పార్టీ నాయకులు పలువురు సన్మానించారు.

పాఠశాలలు రెండు పూటలు నిర్వహించటంపై ఫిర్యాదు

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు ఒంటి పూట నిర్వహించాలని జీవో ఇచ్చినప్పటికీ పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు రెండుపూటలా నిర్వహిస్తున్నారని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం ఎంఈవో వినతి పత్రం సమర్పించారు. విద్యార్థులు వేడికి అల్లాడుతున్నారని, రెండుపూటలా నిర్వహించే పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి మాడవేణి సునీల్, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం..

విద్యుత్‌సరఫరా నిలిపివేత



జగిత్యాలరూరల్: పట్టణంలోని టౌన్–2 పరిధి పాతబస్టాండ్, విద్యానగర్, ఎస్‌కేఎన్ఆర్ రోడ్, రాజీవ్‌చౌక్, ధర్మపురి బైపాస్‌రోడ్, తాతమ్మగుడి, సీతారాంనగర్ కాలనీల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సారంగాపూర్: మండలంలోని సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ (రూరల్) హరీశ్ తెలిపారు.